జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల -పెద్దపల్లి
ఆదివారం, మార్చి 03, 2024 పేజీలు 07



# ప్రతి గ్యారంటీ పథకాన్ని తప్పనిసరిగా అమలు చేస్తాం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు
- మరో 2 గ్యారెంటీ పథకాల అమలు ప్రారంభం
- అర్హులకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు గృహ వినియోగానికి ఉచిత విద్యుత్
- నిపుణుల సూచనల మేరకు మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ చర్యలు
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ఏర్పాటు
- గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు జీరో బిల్ అందించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

పెద్దపల్లి ప్రతినిధి,( ప్రజా జ్యోతి), మార్చి – 2:రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీ, అభయహస్తం గ్యారెంటీ పథకాలను తప్పనిసరిగా అమలు చేస్తామని, మరో రెండు గ్యారెంటీ పథకాల అమలును ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని పట్టణంలో తన క్యాంపు కార్యాలయం సమీపంలోని సత్యసాయి నగర్ లో గృహ జ్యోతి కార్యక్రమం క్రింద జీరో బిల్లులు లబ్ధిదారులకు అందించడం జరిగింది. సత్య సాయి నగర్ లో నివాసం ఉంటున్న డి.వేణుకు 481 రూపాయలు, మంథని లక్ష్మికి 179 రూపాయలు గృహ జ్యోతి సబ్సిడీ క్రింద కరెంట్ బిల్ ప్రభుత్వం చెల్లించి జీరో బిల్లులను వారికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు మరో రెండు గ్యారెంటీ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, 200 యూనిట్ల వరకు గృహ వినియోగానికి ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాల అమలును ప్రారంభించామని అన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం క్రింద ఇప్పటి వరకు 20 కోట్ల జీరో బస్ టికెట్స్ అందించామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం ద్వారా వేల మందికి లబ్ధి చేకూరిందని అన్నారు. గత ప్రభుత్వాలు అవలంబించిన ఆర్థిక విధానం వల్ల మన ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతిందని,

మిగతా 2లో..

# గత పదేళ్ళలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

## బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, మార్చి 2, (ప్రజాజ్యోతి): హైదరబాద్ పట్టణంలోని శంషాబాద్ లోని మల్లికా కన్వెన్షన్ లో శనివారం రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన పంచాయతీ సంఘటనని గుర్తు చేసి, అభినందనలు తెలిపారు. ప్రజలందరి కృషితో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ వస్తె మన అందరి జీవితాలు బాగుపడతాయని అనుకున్నామని, కానీ గత పది సంవత్సరాల్లో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందన్నారు. బిల్లులు రాకా సర్పంచులు ఇబ్బందులు పడ్డారని,

మిగతా 2లో..



పేదల పెన్నిధి, గొప్ప రాజకీయ వేత్త

# శ్రీపాద రావు

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శ్రీపాదరావుకు కలెక్టర్ ఘన నివాళి

కరీంనగర్, మార్చి 2, (ప్రజాజ్యోతి): మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు నిరంతరం పేదల సంక్షేమం కోసం కృషి చేశారని, గొప్ప రాజకీయ వేత్తగా అందరి మన్ననలు పొందారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పత్తి పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ

మిగతా 2లో..



# ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు

## కలెక్టర్ అనురాగ జయంతి నివాళి

సిరిసిల్ల, మార్చి 2, (ప్రజాజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి హాజరై, మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీవైఎస్ఓ రాందాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వైద్య శివప్రసాద్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# పేదల పెన్నిధి, గొప్ప రాజకీయ వేత్త శ్రీపాద రావు



మొదటిపేజీ తరువాయి..

శ్రీపాదరావు 87వ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ తో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు, కవులు, రచయితలు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కలెక్టర్ తో పాటు అధికారులు, ప్రముఖులు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీపాదరావు కాటారం మండలం ధన్వాడ సర్పంచ్ నుంచి అంచలంచెలుగా ఎదిగి ప్రజల గుండెల్లో నిలిచారని పేర్కొన్నారు. పలుమార్లు ఎమ్మెల్యేగా పనిచేసి మంథని నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. స్పీకర్ గా అత్యుత్తమంగా విధులు నిర్వర్తించి, ఆ పదవికే వన్నెతెచ్చారని కొనియాడారు. నిత్యం పేదల సంక్షేమం కోసం పరితపించేవారని పేర్కొన్నారు. ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాల్లో నిత్యం పాలుపంచుకునే వారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం అందరు కృషి చేయాలని సూచించారు. అత్యుత్తమ సేవలందిస్తున్న సాహితీవేత్తలు కవులు, నటులు, పలువురు ప్రముఖులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ప్రముఖ రచయిత గంధ్ర లక్ష్మణరావు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత వారాల ఆనంద్ తో పాటు ఎస్ సంపత్ కుమార్, గొల్లపల్లి రవీందర్, రతన్ కుమార్, ఇస్మాయిల్, దయానంద్ గాంధీ, మంచాల రమేశ్, మానేరు విద్యాసంస్థల చైర్మన్ అనంత రెడ్డిని కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ పవన్ కుమార్, ఆర్డీవో కే మహేశ్వర్, జెడ్పి సీఈఓ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి సుజాత, సంక్షేమ అధికారి సరస్వతి, డిఆర్డిఓ శ్రీధర్, స్పోర్ట్స్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నేతలు దారం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ రావు, రాష్ట్ర వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృపాదానం, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పలువురు ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

**శ్రీపాదరావుకు ఘన నివాళి**

కరీంనగర్ బస్టాండ్ ఎదుట ఉన్న మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తో పాటు అధికారులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు శ్రీపాదరావు చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్షి కిరణ్, కాంగ్రెస్ నేతలు పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పద్మాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్యారంటీ పథకాన్ని తప్పనిసరిగా అమలు చేస్తాం

మొదటిపేజీ తరువాయి

దానిని సరిచేస్తూ ఒక్కో పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు అర్ధ రహిత విమర్శలు మానుకోవాలని, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులలో నాణ్యత, డిజైన్ లోపాలు ఉన్నాయని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తెలియజేసిందని, ముందు వారు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. మంథని ప్రాంతంలో ఉన్న వనరులు ఇక్కడి ప్రజల భూములు వినియోగించుకొని పెద్దపల్లి, భూపాల్ పల్లి జిల్లాకు ఒక్క ఎకరానికి సైతం సాగునీరు అందించకుండా ప్రాజెక్టు రూపకల్పన గత ప్రభుత్వం చేసిందని మంత్రి గుర్తు చేశారు. నిపుణులు, ఎన్.డి.ఎస్.ఏ అందించిన నివేదిక ప్రకారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మత్తులు చేసి పునరుద్ధరణ చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం మంథని లోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, విద్యతో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని భావించిన స్వర్గీయ నాయకులు శ్రీపాద రావు ఇక్కడి గ్రామాలలో పాఠశాలలను ఏర్పాటు చేశారని, స్పీకర్ గా మంచి విలువలు నెలకొల్పారని, జవాబుదారీ తనతో పని చేశారని తెలిపారు.స్వర్గీయ శ్రీపాద రావు ఆశయాల సాధన మేరకు గతంలో మన ప్రభుత్వం హయాంలో జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంథనిలో సంగీత కళాశాల ఏర్పాటు




చేయడం జరిగిందని తెలిపారు.మంథని మారుమూల ప్రాంతంలో సైతం బస్ డిపో ఏర్పాటు చేయడంలో, రోడ్లు లేని గ్రామాలకు కాలినడకన వెళ్లి అందుబాటులో ఉన్న వనరులతో అభివృద్ధి చేయడంలో శ్రీపాదరావు కీలక పాత్ర పోషించారని, ఆయన ఆశయాలను సంపూర్ణంగా పూర్తి చేసే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద లబ్దికి త్వరలో నాంది పలుకుతామని, పైరవీలకు తావులేకుండా అర్హులకు మాత్రమే లబ్ది చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ చేశామని, మెరిట్ విద్యార్థులకు మాత్రమే ఉద్యోగాలు లభిస్తాయని ఎటువంటి పైరవీలకు ఆస్కారం ఉండదని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో బాబా సాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, టి.ఎస్. ఎన్.పి.డి.సి.ఎల్. – ఎస్. ఈ. బి.సుదర్శన్, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు,, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో మునిగి పశువుల కాపరి మృతి



మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 2 ( ప్రజా జ్యోతి) : చెరువునీటిలో మునిగి పశువుల కాపరి మృతి చెందిన ఘటన మెట్ పల్లి మండలం వెంపేట్ లో చోటుచేసుకొంది. మృతుని భార్య తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా, లక్షట్ పేట్ మండలం,కొమ్ము గూడెం కి చెందిన కొమ్ము స్వామి జీవనదారం కోసం మెట్ పల్లి మండలం వెంపేట్ గ్రామానికి వలస వచ్చి పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం పశువులను మెపడానికి వెళ్లిన స్వామి తిరిగి రాలేదు, ఎంత వెతికిన ఆచూకీ తెలియలేదన్నారు. శనివారం ఉదయం చెరువు వద్ద చూడగా నీటమునిగి చనిపోయి ఉన్నాడని తెలిపారు.చెరువులోకి వెళ్లిన పశువులను బయటకి కొట్టుకోచ్చే క్రమంలో లోతు తెలియక నీట మునిగి చనిపోయి ఉండవచ్చని తెలిపారు భార్య ప్రేమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ ఐ చిరంజీవి తెలిపారు.

# గత పదేళ్ళలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం



మొదటిపేజీ తరువాయి..

ఆనాడు రాజీవ్ గాంధీ గ్రామ పంచాయతీ లను పటిష్ట పరిస్తే ఇప్పుడు 10 సంవత్సరాలుగా పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ ఈ 10 ఏళ్లలో ప్రతినిధులకు సంబంధం లేకుండానే కార్యక్రమాలు జరిగిపోయాయన్నారు. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ద్వారా మీనాక్షి నటరాజన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్ నుండి ఎంపిగా అయిన తరువాత నేను కరీంనగర్ నుండి ఎంపిగా ఒకేసారి గెలిచామని అన్నారు. వారు పార్లమెంట్ లో తెలంగాణ కోసం మాకు మద్దతుగా నిలబడ్డారన్నారు. వారి ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం ద్వారా మరింత ముందుకు వెళదామన్నారు. అధికారాలను వికేంద్రీకరణ ద్వారా ముందుకు వెళదామనీ, పంచాయతీ రాజ్ లో, మున్సిపాలిటీలలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చట్టాలు ఉంటాయన్నారు. ధరణి ప్రాబ్లమ్స్ ,అటవీ రక్షణ, ప్రకృతి చర్యలపై మరింత ముందుకు వెళ్లాలన్నారు. క్షేత్ర గ్రామీణ స్థాయి సంఘటన్ ద్వారా కార్యక్రమాలను తీసుకుపోవాలన్నారు. అందరి సహకారంతో ఎన్ఎస్యుఐ అధ్యక్షుడి నుండి మంత్రి వరకు ఎదిగినానని, ఈ ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరిని మరిచిపోకుండా వారి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ కన్వీనర్ మడుపు మోహన్, సభ్యులు మూల రవీందర్ రెడ్డి, బొమ్మ ఈశ్వర్ గౌడ్, ఉప్పుల అంజలి ప్రసాద్, కాశీపాక రాజేష్, గడ్డం శ్రీరాములు, బోనాల మురళి, మనోహర్, తదితరులు తరలివెళ్లారు.

# ప్రైవేటు ఆసుపత్రులలో సాధారణ కాన్పులు ప్రోత్సహించాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత**

**ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బందికి అవహన సదస్సు**

రాజన్న సిరిసిల్ల, మార్చి 2, (ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బందికి శనివారం ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో హెచ్ఎంఐఎస్, ఈ బర్త్ పోర్టల్, పీసీపీఎన్డీ యాక్ట్ మొదలగు కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఆసుపత్రులలో సి సెక్షన్స్ అనగా ఆపరేషన్ కాన్పులు ఎక్కువగా జరుగుతున్నందున, సాధారణ కాంపులు ప్రోత్సహించాలని, ఆపరేషన్ కాన్పుల వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యం క్షీణించి, ఇద్దరికీ ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. కావున సాధారణ ప్రసవాలు జరిగేటట్టు చూడాలని, లేనిపక్షంలో వారిపైన తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలియజేశారు.







## ఉచిత విద్యుత్ పథకం అమలు

**కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం**

గన్నేరువరం మార్చి 2 ( ప్రజా జ్యోతి) : గన్నేరువరంమండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకం మండలం కేంద్రంలో శనివారం ప్రారంభం అయింది. గ్రామంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ శాఖ వారు జీరో బిల్ ను శనివారం బుర్ర అరుణకు అందజేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. మా ఇంటికి జీరో బిల్లు వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కరెంటు ఆపరేటర్లు గృహ జ్యోతి స్కీమ్ సబ్ ఇంజనీర్ థామస్, జూనియర్ లైన్ మెన్ రాజు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి



మెట్ పల్లి ప్రతినిధి మార్చి 2 ( ప్రజా జ్యోతి) : మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆయన ఫోటోకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధర్మపురి దేవస్థానం మాజీ అధ్యక్షులు జువ్వాడి కృష్ణారావు పూలమాల వేసి ఘనంగా జయంతి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కౌన్సిలర్స్ రాజయ్య, కో ఆప్షన్ మార్గం గంగాధర్ ,ఎర్రోళ్ల హనుమాన్లు, పూదరి నర్సాగౌడ్, జక్కని కుందన్, యూత్ అధ్యక్షులు జట్టి లక్ష్మణ్, మైనార్టీ నాయకులు ఆఫీస్ , బొడ్ల ఆనంద్, ఉల్లెందుల రమేష్, షేక్ మహమ్మద్ ,చరణ్ సింగ్, సుంకేట ఆనంద్ ,భుర మహేందర్, ఆడెపు రమణ,చిరంజీవి ,జాజాల రాజగోపాల్ ,పొన్నం తిరుపతి గౌడ్ ,షకీల్ పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున డైరీ అధినేతకు ప్రజా జ్యోతి డైరీ అందజేత



హుజూరాబాద్/ ప్రజా జ్యోతి :తెలుగు దినపత్రికలో అంచలంచలుగా ఎదుగుతున్న ప్రజా జ్యోతి దినపత్రిక డైరీని శనివారం ప్రజా జ్యోతి హుజరాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి దేవేందర్ నాగార్జున డైరీ అధినేత పుల్లూరి ప్రభాకర్ రావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా జ్యోతి దినపత్రిక ప్రజా సమస్యలపై స్పందించి వారికి న్యాయం చేస్తుందని అన్నారు. పత్రిక రంగంలో మరింత ఎదగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున డైరీ డైరెక్టర్ పుల్లూరి గణేష్ రావు తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్గీయ శ్రీపాదరావు సేవలను ప్రభుత్వం గుర్తించడం సంతోషకరం

- **రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**
- **అధికారికంగా శ్రీపాదరావు జయంతి నిర్వహణకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు**
- **మంథని ప్రాంతంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించే దిశగా చర్యలు**
- **మంథని అభివృద్ధి కోసం 125 కోట్లతో మంథని శివారం బ్రిడ్జి నిర్మాణం**
- **మంథని పట్టణంలో శ్రీపాద చౌరస్తా వద్ద నిర్వహించిన శ్రీపాద రావు జయంతి వేడుకలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి**





పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), మార్చి – 02:పేద ప్రజల, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన స్వర్గీయ శ్రీపాదరావు సేవలను ప్రభుత్వం గుర్తించి వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషకర మని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం శ్రీపాదరావు జయంతి సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని పట్టణంలో శ్రీపాద చౌరస్తా వద్ద గల శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అరుదైన నాయకులలో శ్రీపాద రావు ఒకరని, వారి సేవలను గుర్తించి జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్ లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే లు విజయ రమణా రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ల దృష్టికి తీసుకు వెళ్ళారని, వారి కోరికను అంగీకరించిన ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. నిరంతరం పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన నాయకులు శ్రీపాద రావు అని, ఆయన ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా విధులు నిర్వహించారని, ఆయన జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు, సహచర మంత్రి వర్యులకు, ప్రభుత్వం తరపున అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించాలని కోరిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. మంథని ప్రాంత ప్రజల ఆశీర్వాదం మేరకు తనకు శాసనసభ్యుడిగా అవకాశం కలిగిందని, తమ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే మంత్రివర్గంలో తనకు స్థానం కల్పించి ఈ ప్రాంతానికి మరింత సేవ చేసే అవకాశం కల్పించారని ఆయన అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి పరంగా ఈ ప్రాంతంలో నివసించే అనేక మందికి మేలు చేయాలని ఉద్దేశంతో తనకు అందించిన అవకాశాన్ని సంపూర్ణంగా వినియోగించు కుంటానని తెలిపారు. తనకు ఉన్న శక్తి మేరకు కృషి చేసి మంథని ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు.మంథని రైతులకు సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనేది మానాన్న గారి లక్ష్యమని, దానిని నెరవేర్చే దిశగా ఇక్కడ చిన్న లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, కాళేశ్వరం ప్రాజెక్టులో ఆ లిఫ్ట్ లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. మంథని ప్రాంత రైతుల ప్రయోజనార్థం వేగవంతంగా అవసరమైన లిఫ్ట్ ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.ఎస్సారెస్పీ నీరు చివరి ఆయకట్టు వరకు రాకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని, పైన ఉన్న రైతులు నీరు వాడుతున్నారని, దీనివల్ల చివరి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిని నివారించే దిశగా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతుకు అవసరమైన మేర సాగునీరు అందించాలని, నీటి దుర్వినియోగం జరగకుండా చూడాలని మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. స్వర్గీయ శ్రీపాద రావు ఆలోచనల మేరకు మంథని నుంచి శివారం వరకు 125 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసుకున్న తరువాత మంథని పట్టణం వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి దిశగా పాలన సాగిస్తున్న ప్రభుత్వం పట్ల సంఘవిద్రోహులు చేసే అసత్య ప్రచారాలకు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని. చట్టాన్ని మీరే ప్రతి ఒక్కరిపై పార్టీలకతీతంగా చర్యలు తీసుకుంటామని, ఎవరిని ఊపేక్షించమని అన్నారు. అనంతరం రావుల చెరువు వద్ద ఉన్న శ్రీపాదరావు విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించి, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మంథనిలోని సామాజిక ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, ప్రజాప్రతినిధులు, సంభందిత అధికారులు, పార్టీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూర్యగర్ ముఫ్త్ బిజ్లి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- **సోలార్ రూఫ్ టాప్ పథకం తో ఉచిత కరెంట్**
- **పోస్ట్ ఆఫీస్ లో ఆన్ లైన్ దరఖాస్తులు**
- **పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్**



జమ్మికుంట,మార్చి2( ప్రజా జ్యోతి): దేశంలో కరెంట్ ఉత్పత్తిని పెంపొందించడానికి ప్రజలకు కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించడానికి, రోజు రోజుకి పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి, సహజ వనరులను కాపాడుకోవడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడంపై సబ్సిడీని అందిస్తుదని దీనిని అందరూ వినియోగించుకోవాలని పెద్దపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ తెలిపారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని దేశవ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు..ఇందులో భాగంగా వినియోగదారులు పక్కా ఇల్లు గ్రౌండ్ ఫ్లోర్ గలవారు, ఒకటవ, రెండు అంతస్తులు గలవారు ఇంటి పైకప్పులపై సోలార్ ప్లేట్లను అమర్చనున్నారని, దీనిద్వారా వారికి సౌర విద్యుత్తును వినియోగించుకోవడంతో పాటు కరెంటు బిల్లుల భారం కూడా తగ్గుతుందన్నారు.. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి సామాన్య పౌరులపై కరెంట్ ఛార్జీల భారం తగ్గించడం కోసం కేంద్ర ప్రభుత్వం "పీఎం సూర్యగర్ ముఫ్త్ బిజ్లి యోజన" పథకానికి శ్రీకారం చుట్టినదని అన్నారు.. ఈ స్కీమ్ దేశవ్యాప్తంగా ఇళ్లకు సబ్సిడి తో సోలార్ రూఫ్ ప్లాంట్లను నిర్మించి ఇచ్చి, నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ గరిష్టంగా Rs.78,000 ల రాయితీ కూడా పొందుకోవచ్చు అన్నారు. 1 కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.30 వేలు, 2 కిలో వాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.60 వేలు, 3 కి.వా లేదా అంతకన్నా ఎక్కువ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.78 వేలు గరిష్ఠ రాయితీ అందు తుందని చెప్పారు...ఈ పథకానికి పోస్టాఫీసు ఆధ్వర్యం లో రిజిస్ట్రేషన్ లు ప్రారంభించమన్నారు.ఆసక్తి కలిగిన వినియోగదారులు పోస్టల్ సిబ్బందికి తమ వివరాలను అనగా "మీ ఇంటి నెంబర్, కరంటు బిల్ నకలు" అందజేస్తే వారి ఆ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తారని, నమోదైన తరువాత సంబంధిత అధికారులు సోలార్ ప్లాంట్ లను దరఖాస్తుదారుల ఇంటికే వచ్చి ఇంస్టాల్ చేస్తారని తెలిపారు.. ప్రజలు అత్యధిక సంఖ్య లో దరఖాస్తు చేసుకోని లబ్ధిపొందలని సూచించారు.. మరిన్ని వివరాలకు మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో హుజరాబాద్ పోస్ట్ మాస్టర్ ఊకంటి మహేందర్ పాల్గొన్నారు..

## మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలు

**పాల్గొన్న సర్వాయిపాపన్న మోకుదెబ్బ రాష్ట కమిటీ**



జమ్మికుంట, మార్చి2( ప్రజా జ్యోతి): భువనగిరి మాజీ ఎం పి బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ని ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహిచారు.ఈ కార్యక్రమంలో సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడసంఘము నాయకులు బూర నర్సయ్య గౌడ్ తో కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వ:హిచారు.ఈ కార్యక్రమంలో రాష్ట వ్యవస్థాపక అధ్యక్షులు జక్కే వీరస్వామి గౌడ్, రాష్ట ప్రధాన కార్యదర్శి పల్సమ్ సోమన్న గౌడ్, రాష్ట కోశాధికారి రేగటి నాగరాజు గౌడ్, బీసీ నాయకులు ఎన్ కుమార్ ముదిరాజ్, సంఘము జిల్లా మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీరుపూర్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర ఆదాయం 26 లక్షల 6 వేల 719

బీరుపూర్, మార్చి 2 (ప్రజాజ్యోతి): బీరుపూర్ మండల కేంద్రంలో కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా 12 రోజులు అత్యంత బ్రహ్మాండంగా జరిగిన జాతరలో హుండీ టికెట్స్ ద్వారా 12,31,633 లక్షలు బంగారం మిశ్రమం 14 గ్రా: వెండి మిశ్రమం 2 కిలోల 20 గ్రాములు మొత్తం ఆదాయం 26 లక్షల 7 వేల 719 ఆదాయం వచ్చినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఏనుగంటి సామ్రాట్, ఇన్స్పెక్టర్ రవికిషన్, ముప్పాల రాంచందర్ రావు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు

మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 2 ( ప్రజా జ్యోతి) : మెట్ పల్లి పట్టణంలోని 12వ డిడి నగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు షాకీర్ సిద్ధికి,ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ కీర్తిశేషులు దుద్దిళ్ళ శ్రీపాదరావు, జయంతి వేడుకలు డి డి నగర్ అంగన్వాడి కేంద్రంలో కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీపాదరావుచేసిన సేవలు గణనీయమని వారి కుమారుడు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు అరిసెల మాధవి,అనిత, సమైక్య సంఘం అధ్యక్షురాలు పిట్ల లావణ్య, లక్ష్మి, మాగిని పోశాని, తన్నీరు మంగా తదితరు పాల్గొన్నారు.

## శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

### మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు



సుల్తానాబాద్ మార్చ్ 2( ప్రజా జ్యోతి) తెలంగాణ ప్రాంత ప్రజల ఆప్తులు మంథని మాజి శాసనసభ్యులు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం మంథని నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అంచలంచెలుగా ఎదిగి స్పీకర్ స్థానాన్ని కైవసం చేసుకుని ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ కౌన్సిలర్లు పాసేడ్ల మమత సంపత్ నిషాద్ రఫీక్ ఊట్ల వర ప్రదీప్ చింతల సునీత రాజు రేవెల్లి తిరుపతి దున్నపోతుల రాజయ్య లతోపాటు మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్ మేనేజర్ అలీముద్దీన్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే విజయ రమణారావు



సుల్తానాబాద్ మార్చ్ 2( ప్రజా జ్యోతి) సుల్తానాబాద్ మండలం సుద్దాల, చిన్న బొంకూర్ గ్రామాలలో దాదాపు 35 లక్షల రూపాయలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు చిన్న బొంకూరులో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయలు, సీసీ రోడ్డు నిర్మాణానికి 5 లక్షల రూపాయలు సుద్దాల సిసి రోడ్డు నిర్మాణానికి 10 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మినపల స్వరూప ప్రకాష్ రావు ఎంపీపీ బాలాజీ రావు సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అంతటి అన్నయ్య గౌడ్ చిలక సతీష్ దామోదర్ నాయక్ పన్నాల రాములు గుజ్జ విజయరావు ఎంపీటీసీ పకీర్ యాదవ్ మేకల పోశం యాదవ్ పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు

# మహిళల ఆర్థిక అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు





పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), మార్చి – 2: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం రాష్ట్ర,ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని పట్టణంలో ఎన్.ఏ.సి ను సందర్శించి మహిళలకు రెండవ బ్యాచ్ కుట్లు, అల్లికల శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ కుట్లు, అల్లికలను సంపూర్ణంగా నేర్చుకోవాలని, వివిధ డిజైన్లలో మహిళల దుస్తులుకుట్టడం, డిజైన్లు రూపొందించడం నేర్చుకుంటే గణనీయంగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. ప్రతి బ్యాచ్ లో శిక్షణకు వచ్చే మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తున్నామని, మహిళలు శిక్షణను సంపూర్ణంగా వినియోగించుకుంటూ తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ఆదాయం అర్జించాలని అన్నారు. మంచి టెయిలరింగ్ నైపుణ్యం ఉన్న వారికి మార్కెట్ లో మంచి అవకాశాలు అందుబాటులో ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. మంథని ఎన్.ఏ.సి లో శిక్షణ పొందే మహిళలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడం జరుగుతుందని, మహిళల అభ్యర్థన మేరకు వెంటనే స్టాండింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఏ.సి ఇంచార్జి బి.రజిత, మహిళలు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాలు మనకు వ్యక్తిత్వ వికాస పాఠాలు

### అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్



పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజా జ్యోతి), మార్చి– 02: మహనీయుల జీవితాల నుంచి మనం అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్చుకోవచ్చని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలలో పాల్గొన్నారు. దుదిల్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి దుదిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దుదిల్ల శ్రీపాదరావు జీవిత ప్రస్థానాన్ని కలెక్టరేట్ సి విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్ చదివి వినిపించారు.అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతమైన ధన్వాడలో పుట్టి శాసనసభ స్పీకర్ స్థాయికి ఎదిగిన మహనీయులు దుద్దిల శ్రీపాదరావు అని, ప్రతి ఒక్కరితో మంచిగా వ్యవహరిస్తూ తన జీవితం కొనసాగించారని అన్నారు. న్యాయవాదిగా వృత్తి కొనసాగిస్తున్న సమయంలో ప్రజల ఆకాంక్షల మేరకు రాజకీయాల్లోకి వచ్చి సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ స్థాయికి ప్రజల ఆశీర్వాదంతో ఎదిగారని, నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న వ్యక్తి శ్రీపాద రావు అని అన్నారు. మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి జీవితంలోని ముఖ్యంశాల నుంచి మనం వ్యక్తిత్వ వికాస పాఠాలు అనేకం నేర్చుకోవచ్చని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అనేక మంది స్థానిక నాయకుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని, అదే రీతిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు దుద్దిల్ల శ్రీపాద రావు గారి జయంతి జరుపుకోవడం చాలా సంతోషకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## దేవి లక్ష్మీనర్సయ్య సేవలకు దక్కిన గౌరవం

### శ్రీపాద సేవ పురస్కారంతో ఘనంగా సత్కారం

జ్యోతి నగర్ ,(ప్రజా జ్యోతి), మార్చి 2: సామాజిక సేవా తత్పరుడు... సంఘసంస్కర్త... మాజీ పోలీస్ కానిస్టేబుల్ దేవీ లక్ష్మి నరసయ్య సేవలకు అరుదైన గౌరవం దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దివంగత దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి పురస్కరించుకొని శనివారం నిర్వహిస్తున్న అధికారిక వేడుకల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు స్వచ్ఛంద సేవకులను గుర్తించి సత్కరించారు. దీనిలో భాగంగా సామాజిక స్వచ్ఛంద సేవకులు, దళిత రత్న అవార్డు గ్రహీత దేవి లక్ష్మి నరసయ్య ను ఘనంగా సత్కరించారు.. గతంలో శ్రీపాద జయంతి సందర్భంగా 2009లో శ్రీపాద రక్తదాత అవార్డు, 2010లో శ్రీపాద ప్రాణదాత అవార్డు కూడా అందుకున్నారు లక్ష్మీనర్సయ్య. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ సర్పంచ్, కేశోరామ్ సిమెంటు కర్మాగారం కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య మాట్లాడుతూ తన విలువైన పోలీస్ ఉద్యోగాన్ని సైతం త్యాగం చేసి ప్రజాసేవలో నిమగ్నమవుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తు ప్రజల్లో తనకు మంచి పేరు ఉందని సేవా కార్యక్రమాల ద్వారానే మనిషి పునీతుడు అవుతాడని అన్నారు. శ్రీపాదరావు జయంతి రోజున సంఘ సేవకులను గుర్తించి.. గౌరవించి.. సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# మహాలక్ష్మి పథకం ఉచిత కరెంట్ బిల్ ప్రారంభం

శంకరపట్నం, మార్చి 2(ప్రజా జ్యోతి) రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టాక గృహజ్యోతి పథకం ద్వారా రాష్ట్ర ప్రజలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ సంబంధించిన జీరో బిల్లులు శనివారం ప్రారంభమయ్యాయి. శంకరపట్నం మండల పరిధిలోని తాడికల్ ఆముదాలపల్లి సబ్ స్టేషన్ ల పరిధిలోని ఇప్పలపల్లి, నల్ల వెంకయ్య పల్లె గ్రామాలలో జీరో బిల్లులు జారీ చేశారు. కాగా ఈ నెల నుండి వచ్చే బిల్లులు 200 యూనిట్ల వరకు ఉచితంగా అందించబడతాయని, ఆపై వచ్చే యూనిట్లకు బిల్ చేయబడతాయని ఏఈ సంపత్ రెడ్డి, కుమారస్వామిలు తెలిపారు. అదేవిధంగా మార్చి నెలకు ముందు ఉన్న బకాయి బిల్లులను తప్పకుండా చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. జీరో బిల్లుల జారీలో దరఖాస్తుదారులు ప్రజాపాలన కార్యక్రమంలో చేసుకున్న దరఖాస్తులలో లోపాలు జరిగి కొందరికి ఉచిత బిల్లు రాలేదని పేర్కొన్నారు. అయితే ఈనెల వచ్చిన బిల్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్ జత చేసి సోమవారం నుండి ఎంపీడీవో కార్యాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవడం సవరణ జరుగుతుందని, ఈనెల వచ్చిన బిల్లు కూడా పోతుందని అదేవిధంగా ఒక రేషన్ కార్డు నెంబరుకి, ఒక మీటర్ పైననే గృహజోతి వర్తిస్తుందని, రెండు మీటర్ లు ఉండి ఒకరేషన్ కార్డు ఉంటే ఏదైనా ఒకదానికి మాత్రమే వర్తిస్తుందని వివరించారు. ఎస్ఇ. హరికృష్ణ, ఎల్ఐ. రవీందర్, జేఎల్ఎం దుర్గం శ్రీనివాస్, అసిస్టెంట్ హెల్పర్ చందు పాల్గొన్నారు.



## అగ్గి తెగుళ్లకు నివారణ చర్యలు చేపట్టాలి

### ఏ.ఈ.ఓ సుష్మాశ్రీ



కథలాపూర్, మార్చి 2(ప్రజాజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంట పెరిగే దశలో, పలు ప్రాంతాల్లో పిలకల దశలో ఉన్నందున చల్లని వాతావరణం ఉండడంతో వరి పంటలో చీడపీడలు ఆశించి పంటను నష్ట పరుస్తున్నాయయని ఏ.ఈ.ఓ సుష్మాశ్రీ అన్నారు. శనివారం మండలంలోని పోసానిపేట గ్రామంలో పలువురి రైతుల వరి పంట పొలాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. రైతులు పిలకదశలో ఉన్నపుడు ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడొద్దని.. మోతాదు ప్రకారమే వాడాలని, వరిలో అగ్గితెగులు నివారణ కోసం ట్రైసైక్లోజోల్ 0.6మి.లీటరు, మొగి పురుగు నివారణకు క్లోరాంతప్రోలిన్ 0.2మి లీటరు మందులను పిచికారి చేయాలని నివారణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏ.ఈ.ఓ సుష్మాశ్రీ పేర్కొన్నారు.

## ఎస్సైని కలిసిన భూమారెడ్డి



కథలాపూర్, మార్చి 2(ప్రజా జ్యోతి): కథలాపూర్ మండలం పోలీస్ స్టేషన్లో ఇటీవల నూతనంగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నవీన్ కుమార్ ను రైతు సంఘం మండలాధ్యక్షుడు గడ్డం భూమారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి సన్మానించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**మెట్ పల్లి ప్రాజెక్ట్ సిడిపిఓ తిరుమల దేవి**



కోరుట్ల మార్చి 2 ప్రజా జ్యోతి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మెట్ పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ తిరుమల దేవి అన్నారు. శనివారం పట్టణంలోని రహమత్ పుర-1 అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని సిడిపిఓ మాట్లాడారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని అన్నారు. ఆరోగ్యంగా ఎదగాలంటే అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టిక ఆహారాన్ని తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మహిళల కు బాలికల కు ప్రభుత్వం ఇస్తున్న భద్రత పై కూడా అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లను వినియోగించుకొని తమను తాము రక్షించుకోవాలని ఆమె కోరారు. ఈ సమాజంలో మహిళల పాత్రే కీలకమని అందుకే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు హేమలత, షైనీలు అంగన్వాడి టీచర్లు కల్వకోట ప్రేమలత, చింతా అరుణ మరియు మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

**- బిజెపి, బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి చేరిక**

**- గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం: జువ్వాడి**



మల్లాపూర్ మార్చ్ 2 ( ప్రజా జ్యోతి) :మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు శనివారం ప్రారంభించారు. అనంతరం బిజెపి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు 200 మంది కార్యకర్తలు మాజీ సర్పంచ్ ఎంపీటీసీ కాంగ్రెస్ లో చేరికయ్యారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం రాబోయే ఎంపీ ఎలక్షన్లో భారీ మెజార్టీ ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ జువాడి నర్సింగరావు, జువాడి కృష్ణారావు, కొమిరెడ్డి కరం, మాజీ జెడ్పిటిసి ఎ లాల జలపతి రెడ్డి, నాయకులు పుంద్ర శ్రీనివాస్ రెడ్డి, మరిపెల్లి మల్లయ్య ,కోటగిరి ఆనందు, లక్ష్మారెడ్డి, మిట్టపల్లి జీవన్, చిప్ప రఘు ,చిప్ప శంకర్, చిప్ప లక్ష్మీం జిమ్ ,రాజేందర్, జమాలు ,గండికోట శ్రీనివాస్ వినోదు నల్ల బాపురెడ్డి, గంగుల వెంకటేష్ ,నవనంది నడిపి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపాద.... మరువదు నిను ఈ ప్రజా

**పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలకుర్తి మండలంలో ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు...**





జ్యోతినగర్, (ప్రజా జ్యోతి), మార్చి 2: : శ్రీపాద.... మరువదు నిను ఈ ప్రజా అంటూ పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పాలకుర్తి మండలంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పీకర్ దివంగత దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి పురస్కరించుకొని పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ సర్పంచ్లు, కేశోరామ్ సిమెంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షులు సూర సమ్మయ్యల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాద రావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ...1983 నుంచి వరుసగా మంథని ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన శ్రీపాదరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా కూడా పని చేశారని గుర్తు చేశారు. ఆయన మరణించిన.. ఇప్పటికి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు. ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన శ్రీధర్ బాబు అదే నియోజకవర్గం నుంచి తండ్రిని మించిన తనయుడిగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రస్తుతం ఐటి శాఖ మంత్రిగా కొనసాగుతున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్లో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడం అరుదైన గుర్తింపు ఇచ్చినట్లు అయిందని పేర్కొన్నారు. ఇదే శ్రీపాదరావుకు నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం సామాజిక కార్యకర్తలకు, స్వచ్ఛంద సేవకులకు, మూడు దశాబ్దాల సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గంగధర రమేష్ ,ఎంపిటిసి పాత భాగ్యలక్ష్మి రవీందర్ గారు, పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తలారి శంకర్ గారు, మాజీ సర్పంచ్ లాల్ సింగ్ , గండికోట వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ జ్యోతి శంకర్ నాయక్, గద్దల మహేందర్, బుర్ర పరశురామ్ గౌడ్, చిలగాని రాజేష్, సూర సంతోష్, యూత్ ప్రెసిడెంట్ అన్నం కృష్ణ పటేల్, కలవేనా శ్రీనివాస్, భూతగడ్డల రమేష్, తిప్పని చంద్రమౌళి, భూత గడ్డల రమేష్, ఎరుకల సాగర్, ఎరుకల శ్రీధర్, వేర్పుల రాజకుమార్, పాలకుర్తి మండల కార్మిక నాయకులు ఎండి ఫయాజ్ ,కలవేన స్వామి, రావుల నారాయణ, తిరుపతి, రాజు,ఉప సర్పంచులు వార్డు సభ్యులు సింగిల్ డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు అన్ని విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సహకారంతోనే ఎక్సలెన్సీ అవార్డు

**ఉద్యోగుల సహకారంతోనే ఎక్సలెన్సీ అవార్డు**



హుజూరాబాద్/ ప్రజా జ్యోతి :నాగార్జున డైరీ లో పనిచేస్తున్న ఉద్యోగుల అందరి సహకారంతోనే ఎక్సలెన్సీ 2024 అవార్డు వచ్చిందని నాగార్జున డైరీ అధినేత పుల్లూరి ప్రభాకర్ రావు అన్నారు. శనివారం హుజురాబాద్ లోని పరకాల క్రాస్ రోడ్ వద్ద గల నాగార్జున డైరీలో అవార్డు ప్రధానం సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లుగా డైరీ ప్రజలకు నిష్పక్షపాతంగా నిజాయితీతో పని చేస్తూ ప్రజల మన్ననలు పొందుతుంది అన్నారు. డైరీ నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనిచేస్తుందని అన్నారు. ప్రజల సహకారంతో మున్ముందు మరిన్ని సేవలందిస్తామని అన్నారు. ఎవడు రావడంలో డైరీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి శ్రమ దాగి ఉందని అన్నారు. దీంతోపాటు నాణ్యమైన పాలు ప్రజలకు అందించడానికి ఎప్పుడూ నాగర్జున డైరీ ముందుంటుందన్నారు. అలాగే పాల నాణ్యతను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి మైక్రో బయాలజీ ల్యాబ్ ను కూడా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో డైరీ అధినేత ప్రభాకర్ సతీమణి అహల్య, నాగార్జున డైరీ డైరెక్టర్ పుల్లూరి గణేష్ రావు శృతి లతో పాటు నాగార్జున డైరీ మేనేజర్స్ కృష్ణ ప్రసాద్ సుధాకర్ రజినీకాంత్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు

**ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్**



పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజా జ్యోతి), మార్చి- 02: మార్చి 3న ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ తెలిపారు.శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, భారతదేశం పోలియో రహిత దేశమని, కాని కొన్ని దేశాల్లో పోలియో ఇప్పటికీ ఉందని, మళ్ళీ తిరిగి రావచ్చునని, పిల్లలకు రక్షణ కల్పించడంలో ఎలాంటి అశ్రద్ధ చేయకుండా, పిల్లలకు పోలియో చుక్కలు ప్రతిసారి వేయించి పోలియోపై విజయం సాధించుటకు తోడ్పాటును అందించాలని ప్రజలను కోరారు. దేశవ్యాప్తంగా ఈ ఆదివారంనాడు 0 నుండి 5 సంవత్సరముల పిల్లలందరికి పోలియో చుక్కలు వేయుటకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామాలలో, పట్టణ వార్డులలో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మన జిల్లాలో ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జనరల్ ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రులతో పాటు వివిధ గ్రామాలలో, వార్డులలో మొత్తం 381 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసి 62,700 మందికి 4040 వాయల్స్ తో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు .ఆదివారం నాడు అందరు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించలని, ఆసుపత్రులలో అప్పుడే పుట్టిన పిల్లలకు కూడా పోలియో చుక్కలను వేయుటకు ఏర్పట్లు చేశామని అన్నారు.మార్చి 4 నుంచి మార్చి 5 వరకు 2 రోజుల పాటు ఇంటింటికి తిరిగి అనివార్య కారణాల వలన పోలియో చుక్కలు వేయించుకోని వారిని గుర్తించి వారికి కూడా పోలియో చుక్కలు వేస్తామని 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా పల్స్ పోలియో చుక్కలను వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా ఇమ్యూనైజెషన్ అధికారి డాక్టర్ పి.కృపాబాయి మాట్లాడుతూ ప్రయాణ ప్రాంగణాల్లో, రైల్వేస్టేషన్లలో 24 ట్రాన్సిట్ పాయింట్లలో కూడా పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.జిల్లాలో 149 హైరిస్క్ ప్రాంతాలు (వలస కార్మికులు, ఇటుక బట్టీలు, నిర్మాణ కార్మికులు) గుర్తించి, వారి పిల్లలకు ప్రత్యేక బృందాలు (24) ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. ఈ మీడియా సమావేశంలో వైద్యారోగ్య శాఖ అధికారులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.



## నిర్దేశిత సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రతి మిల్లు నుంచి సేకరించాలి

**అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్**

పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), మార్చి- 02:2023-24 వానాకాలం పంటకు సంబంధించి నిర్దేశిత సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రతి మిల్లర్ దగ్గర నుంచి రాబట్టుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో 2022-23 యాసంగి సీఎంఆర్ రైస్ బకాయిల వసూలు, 2023-24 వానాకాలం పంట రైస్ మిల్లర్ల నుంచి రాబట్టుకోవాల్సిన సిఎంఆర్ రైస్ బకాయిలు ప్రభుత్వానికి అందజేయడానికి అవలంబించాల్సిన విధానం ఎన్ఫోర్స్మెంట్ స్టాఫ్ తో సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లో ప్రతి రైస్ మిల్లర్ల దగ్గర నుంచి ప్రతి రోజు వారి మిల్లింగ్ కెపాసిటీ బట్టి సీఎంఆర్ డెలివరీ చేయాలని, అలా చేయని మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించి వారి వద్ద ఉన్న ధాన్యాన్ని సక్రమంగా నడిపిస్తున్న మిల్లుకి షిఫ్టింగ్ చేయాలని ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ పట్ల జాగ్రత్తగా వ్యవహరించి రేషన్ దుకాణాల ద్వారా పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ సంబంధించిన బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా దారి మల్లిస్తే వారి పట్ల కూడా కఠినంగా వ్యవహరించి కేసులు పెట్టాలని ఆదేశించారు.ఎన్ఫోర్స్మెంట్ స్టాఫ్ విధిగా వారి బాధ్యతలు నిర్వహించి నియమబద్ధంగా టూర్ డైరీ సమర్పించి వారి టార్గెట్ ప్రకారంగా రైస్ మిల్లుల్ని , రేషన్ షాపుల్ని తనిఖీ చేసి ప్రజా పంపిణీ వ్యవస్థని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## మహాశివరాత్రి గోడ పత్రికలను ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

మల్లాపూర్ మార్చ్ 2 ( ప్రజా జ్యోతి) : మల్లాపూర్ మండలకేంద్రంలో కొలువుదీరిన శ్రీ కనక సోమేశ్వర స్వామి జాతర మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల 8న ప్రారంభమయ్యే జాతర ఉత్సవాన్ని పురస్కరించుకుని గోడపత్రికలను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి ప్రజా ప్రతినిధులు,శివదీక్ష పరులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంఘ రాజన్న మాజీ జెడ్పిటిసి పిల్లల జలపతి రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉద్ధం శరత్ గౌడ్ మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్ రెడ్డి బిజెపి మాజీ అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణ గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు ముష్కరి రమేష్ కొప్పుల మహేష్ రెడ్డి క్యాతం జీవన్ రెడ్డి వెలుముల రాజారెడ్డి సిరిపురం రవీందర్ బండారి శివ ముష్కరి రాకేష్ ముస్కరి భూమేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు

### నాటక రంగ కళాకారుడు

## రాజేశంకు కళాకారుల నివాళి



వేములవాడ, మార్చి 2, (ప్రజాజ్యోతి): నాటక రంగ కళాకారుడు రాజేశం మృతి పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య, వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగాక ళాకారుడు రాజేశం చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కళా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కళాతపస్వి ఎల్లా పోశెట్టి మాట్లాడుతూ కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన నాటక రంగ కళాకారుడు మేడారం రాజేశం గుండెపోటుతో మరణించడం నాటక రంగ కళాకారులకు తీరని లోటు అన్నారు. రాజేశం అనేక నాటికలలో షార్ట్ ఫిలింలో నటించారని గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాంస్కృతిక కళా ప్రధాన కార్యదర్శిగా ఉండి సేవలందించారని గుర్తు చేశారు. ఈ సంతాప సమావేశంలో గౌరవ అధ్యక్షులు బొడ్డు రాములు, జిల్లా అధ్యక్షులు సాధన పెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వారాల దేవయ్య, అధ్యక్షుడు వనం రాజయ్య, వనం రాజయ్య, నేరెళ్ల ముత్యం గౌడ్, బీరవెల్లి బాగయ్య, గుమ్మడి రాజేశం, ఎల్లా లత, పల్లికొండ గౌతమి, పడిగల స్వప్న, కోరుట్ల వర్ష కళాకారులు పాల్గొన్నారు

## ఘనంగా మల్లికార్జున స్వామి జాతర



కోరుట్ల మార్చి 2 ప్రజాజ్యోతి: పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతాల్లో కల మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శ్రీశైల మల్లికార్జున స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే స్వామివారికి ప్రత్యేక పూజారి కార్యక్రమాలను నిర్వహించి అభిషేకాలను నిర్వహించారు. అనంతరం పండితులు మల్లికార్జున కళ్యాణాన్ని నిర్వహించారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ లింగం గోపాల్ యాదవ కల సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపాద రావు రాజకీయ జీవితం నేటి తరానికి ఆదర్శం

### కరీంనగర్ డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్, మార్చి 2, (ప్రజాజ్యోతి): మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుదిళ్ల శ్రీపాద రావు జయంతి సందర్భంగా జిల్లా మరియు నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో కరీంనగర్ డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద ఉన్నటువంటి శ్రీపాద రావు విగ్రహం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారు హాజరై జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులతో కలిసి శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నగరంలోని బస్టాండ్ వద్ద ఉన్న శ్రీపాదరావు విగ్రహానికి మొదటిసారిగా అధికారికంగా నిర్వహిస్తున్నటువంటి శ్రీపాద రావు జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ పమేల సత్పతితో కలిసి మానకొండూరు ఎమ్మెల్యే ఖమ్మంపల్లి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీపాద రావు జయంతిని పురస్కరించుకొని నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ పెద్దలు స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు 87వ జయంతి సందర్భంగా వారికి నివాళులు అర్పిస్తూ జిల్లాకు వారు చేసిన సేవలను స్మరించుకోవడం జరుగుతుందని, వారు స్పీకర్ పదవితో పాటు వివిధ హోదాలలో ప్రజాసేవ చేసి రాష్ట్ర జిల్లా రాజకీయాలలో సుదీర్ఘకాలం కొనసాగిన వ్యక్తి అన్నారు. వారి ఆదర్శవంతమైన వారి జీవితాన్ని నేటి తరానికి తెలియజేయాలని ఉద్దేశంతో పట్టణంలోని బస్టాండ్ కూడలిలో వారి విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేసి ప్రజలు గుండెల్లో నిలిచిపోయిన శ్రీపాద రావు చూపిన సన్మార్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులమైన మేమంతా నడుస్తామని, వారి ఆశయ సాధన కోసం లక్ష్యసాధన కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు వైద్యుల అంజన్ కుమార్, సమద్ నవాబ్,



చర్ల పద్మ, ఎండి తాజ్, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, సిరాజ్ హుస్సేన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్, అఖిల్, కుర్ర పోచయ, ములకల ప్రవీణ్, బొబ్బిలి విక్టర్, గడ్డం విలాస్ రెడ్డి, సలీముద్దీన్, నిహాల్ షబానా మహమ్మద్, హనీఫ్, తాళ్లపల్లి సంపత్ గౌడ్, దండి రవీందర్, దన్నా సింగ్, కుంభాల రాజకుమార్, పడిశెట్టి భూమయ్య, ఎండి చాంద్, జ్యోతి రెడ్డి, పురంల రమేష్, వంగల విద్యాసాగర్, నెల్లి నరేష్, గంగుల దిలీప్, సిరిపురం నాగప్రసాద్, జీడి రమేష్, రోడ్ల సతీష్, మాలోతు మహాలక్ష్మి, కంకణాల అనిల్ కుమార్, గుప్తా మాదాసు శ్రీనివాసు, చింతల కిషన్, వాసిం, ఎస్డి అజ్మత్, హస్త పురం రమేష్, ముక్క భాస్కర్, తాళ్ల పెల్లి అంజయ్య గౌడ్, గడప అజయ్, కరీం, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పోతారపు సురేందర్, మంద మహేష్, హస్త పురం తిరుమల, కటకం కృష్ణ, మామిడి సత్యనారాయణ రెడ్డి, వీర దేవేందర్, ఖయ్యూం, మెతుకు కాంతయ్య, ఏజ్రా జయకుమార్, పరదాల లింగమూర్తి, శ్రీరాములు రమేష్, కొట్టే ప్రభాకర్, సర్వర్, మెతుకు కాంతయ్య, కరీం సర్వర్, సిరికొండ, శివప్రసాద్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు



సిరిసిల్ల, మార్చి 2, (ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ గడ్డం మధుకర్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా గ్రామ పంచాయతీ వద్ద కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి ఎండీ సలీం, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీరాం నరేష్, మాజీ వార్డు సభ్యులు గోరిట్యాల రాజమల్లు మాధవి, గాలి విరేశం, శ్రీరాం అంబాధస్, అంబటి ఆంజనేయులు, దిడ్డి శ్రీనివాస్, బల్ల లక్ష్మీపతి, పీస్క గురునాథ్, మాటేటి రాజు, సామల లక్ష్మినారాయణ, వెల్డి కనకయ్య, అడిగొప్పుల శంకర్, పరికిపల్లి రాజు, భోగ రంగయ్య, ఎనగందుల ప్రశాంత్, గ్రామ మహిళలు అడిగొప్పుల యమున, జంగంపల్లి భాగ్యలక్ష్మి, షేక్ రంజాన్, బొల్లి పద్మ, రుక్కు0భాయ్, భిమానపల్లి రాజమని, మందాటి శారద, లగిశెట్టి లక్ష్మి, కొండి లక్ష్మి, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీపాద రావు జయంతి వేడుకలు

గోదావరిఖని, మార్చి2 (ప్రజా జ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర అధ్యక్షులు బొంతల రాజేష్ మాట్లాడుతూ స్వగ్రామం అయిన దన్వాడలో సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాసన సభా స్పీకర్గా ఎదిగారని, రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకుని అజాత శత్రువుగా కష్టం వస్తే ప్రజల మధ్యలో ఉండి వారి కష్ట సుఖాలలో పాలు పంచుకొనేవారన్నారు. ఇతర రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. స్పీకరు పదవికి వన్నె తెచ్చే విధంగా అన్నీ పార్టీల వారితో ,అన్నీ వర్గాల వారితో స్పీకర్గా ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. మంథని నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేసింది శ్రీపాదరావు అని వారు కొనియాడారు. శ్రీపాదరావు రాష్ట్రానికి జిల్లాకు చేసిన సేవలను కొనియాడారు.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ,దాని అనుబంధ సంఘాల నాయకులు పెద్దెల్లి ప్రకాష్, చుక్కల శ్రీనివాస్, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలుయాదవ్, కొప్పుల శంకర్, సింహాచలం, ఆడెపు



రవి, అనుమ సత్యనారాయణ, బూర్ల శ్రీనివాస్, ఎండ గౌస్, మాలెం మధు, గడ్డం సతీష్, బోయిని మల్లేష్యాదవ్, కారం వినయ్, దశరథం, తోట లక్ష్మణ్, రంజిత్ నారాయణ, నాజీమోద్దీన్, శివ, హాస్పిటల్ సిబ్బంది, సూపరింటెండెంట్ దయాల్సింగ్, ప్రిన్సిపాల్ హిమబిందు, ఆర్ఎంఓ అప్పారావు పాల్గొన్నారు.

**వన్ టౌన్ లో......**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులతో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు జయంతిని గోదావరిఖని 1 టౌన్ లోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి శ్రీపాద రావు చిత్ర పటానికి పూల వేసి నివాళులర్పించారు . ఈ కార్యక్రమంలో బి. రవీందర్, ఇన్స్పెక్టర్ -2 ఎస్ ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.



## పీడీఎస్ బియ్యం పట్టుకున్న మెట్ పల్లి ఎస్ ఐ చిరంజీవి

మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 2 ( ప్రజా జ్యోతి) : మెట్ పల్లి పట్టణంలోని శాంతి నగర్ లో అక్రమంగా ఓ ఇంట్లో నిలువ ఉంచిన 20 క్వింటాల్ల పీడీఎస్ బియ్యంను పట్టుకొన్నట్లు ఎస్ ఐ చిరంజీవి తెలిపారు.ప్రత్యేక సమాచారం మేరకు దాడి నిర్వహించగా కొండపల్లి మల్లయ్య తండ్రి నర్సయ్య శాంతి నగర్ తన ఇంట్లో అక్రమంగా నిల్వవుంచిన 20 క్వింటాల్ల బియ్యంను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా పిడి ఎస్ బియ్యాన్ని తరలించినట్లయితే తగిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## ఏసిపి శ్రీనివాస్ జీ ని మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ సంఘం నాయకులు



జమ్మికుంట, మార్చి2( ప్రజా జ్యోతి): హుజురాబాద్ ఏసీపీగా శ్రీనివాస్ జీ ఇటీవల బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో శనివారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హుజురాబాద్ ఏసిపి కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. జమ్మికుంటలో సీఐగా పనిచేసిన గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజకుమార్, జమ్మికుంట మండల అధ్యక్షులు ఏబూసి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ముద్రగడ నవీన్ కుమార్, నాయకులు బాపూరావు, పోతుగంటి సదానందం తదితరులు పాల్గొన్నారు.



## వన్యప్రాణుల రక్షణ కోసం
# సాసర్ ఫీట్ల ఏర్పాటు

**అటవీశాఖ బీట్ అధికారి రత్నాకర్**

మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 2 ( ప్రజా జ్యోతి) : వన్యప్రాణుల రక్షణ కోసం సాసర్ ఫీట్ల ఏర్పాటు చేసినట్లు ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి అటవీ శాఖ బీట్ అధికారి రత్నాకర్ పేర్కొన్నారు. శనివారం వేములకుర్తి అటవీ పరిదిలో రెండు చోట్ల వ్యనప్రాణుల కు వేసవి దృశ్య తాగునీరు అందించేందుకు ప్రత్యేక ట్యాంకర్ ద్వారా నిత్యం నీరు ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు.

## మత్తు తో విపత్తు... ఓ యువత

చెడు చేతులతో చేయకూడదు పొత్తు
అది పరిచయం చేస్తుంది నీకు మత్తు
మొదట్లో అనిపిస్తుంది గమ్మత్తు
ఉహించని ఊబిలో కి దించడమే దాని మహత్తు
తరువాత తెలుస్తోంది వచ్చే విపత్తు
ఆరోగ్య ఆర్థిక సమస్యలెన్నో తలెత్తు
దాంతో మారుతుంది నీ జీవితం చిత్తు
అంతేకాకుండా అవుతుంది ఖాళీ నీ సొత్తు
తల్లిదండ్రులు స్నేహితులు నీతో సహవాసానికి చేతులెత్తు
చివరికి ప్రాణం తీయడమే దాని జిత్తు
మత్తు తో వద్దు పొత్తు... ఎందుకంటే
నాన్నకు నీ భవిష్యత్తు ఓ రంగుల కల
అమ్మ కు నీ ఆయుష్షు హంగుల మాల
చెల్లి కి నీ ఆప్యాయత పాల పొంగుల అల
స్నేహితునికి నీ ధైర్యం ఓ నిండు కుండల
అందుకని....
మత్తురహిత తెలంగాణ మనందరి ధ్యేయం...
అందుకు అఖిల్ మహాజన్ (SP) పోసాడు ఆద్యం...
ఆరంభించింది రాజన్న సిరిసిల్ల పోలీస్ ఉద్యమం..
అందరు సహకరించడం తథ్యం....



**రచన**
**హరినాథ్ రాజు**
**చెన్నమాధవుని**
**ప్రిన్సిపాల్**
**కృష్ణవేణి టాలెంట్ స్కూల్,**
**రుద్రంగి**

## శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి జాతర ఉత్సవాలపై అధికారులతో సమీక్ష సమావేశం



బీరుపూర్ (సారంగాపూర్), మార్చి 2 (ప్రజాజ్యోతి): సారంగాపూర్ మండల్ పెంబట్ల శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు త్వరలో ప్రారంభం కానుండడంతో శనివారం రోజున ఆలయ ప్రాంగణంలో తహశీల్దార్ రవిబాబు అద్వర్యంలో వివిధ శాఖల ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శానిటేషన్ ఆర్టీసి పోలీస్ శాఖ పంచాయతీ రాజ్ ఆరోగ్య శాఖ ఎక్సైజ్ తదితర శాఖలతో జాతర బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ కొల జమున, జడ్పీటిసి మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సోల్లు సురేందర్, ఈవో అనూష, ట్రస్టు ఫౌండర్ పోరండ్ల శంకరయ్య, ఎస్సై తిరుపతి, ఆలయ అదికారులు తదితరులు పాల్గొన్నారు.





# పెద్ద సార్ లేడు ఇసుకకు రైట్ రైట్..

**సహకరిస్తున్న కిందిస్థాయి పోలీసు అధికారులు...**
**మూలవాగు నుండి రాత్రి వేళ**
**జోరుగా అక్రమ ఇసుక రవాణా..**

కోనరావుపేట మార్చి 2 (ప్రజాజ్యోతి):రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మూలవాగునుండి రాత్రి వేళలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ఇసుక మాఫియా రోజు రోజుకు రెచ్చిపోతున్నారు.సదరు ఇసుక స్మగ్లర్లు ఈరోజు ఎస్ఐ సారు లేడు కదా సహకరించండి అంటూ డ్యూటీలో ఉన్న సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడుతూ కుమ్మక్కవుతున్నారు.స్థానిక పోలీస్ స్టేషన్లో పెద్ద సారు ఊరు వెళ్తే చాలు ఆరోజు ఇసుక స్మగ్లర్లకు పండగ వాతావరణం నెలకొన్నట్టే, వెంటనే ఆరోజు విధులు నిర్వర్తిస్తున్న కింది స్థాయి పోలీస్ అధికారుల సహాయంతో మూలవాగు నుండి వందల ట్రిప్పుల ఇసుకను రాత్రికి రాత్రి రవాణా చేస్తూ భారీ మొత్తంలో డబ్బులు దండుకుని, ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు .దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. మండలంలోని కొన్ని గ్రామాలలో జోరుగా ఇసుక రవాణా జరుగుతున్నపటికి మైనింగ్,రెవెన్యూ,పోలీస్ శాఖ అధికారులు మాత్రం వీటిపై ప్రత్యేక దృష్టి సారించక పోవడంతో అక్రమ ఇసుక రవాణకు అడ్డుకట్ట వేయలేక విపలమవుతున్నారు. అంతేకాకుండా సంబంధిత శాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునిగితేలుతున్నారని, అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవాల్సిన రక్షక భటులే వారికి ఇన్ఫర్మేషన్ ఇచ్చి రక్షిస్తున్నారని ప్రజలు అంటున్నారు. గతంలో ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన ఓ పోలీసు అధికారికి ఇసుక మాఫియా తో సంబంధాలు ఉండి ఓ వ్యక్తి ఇన్ఫర్మేషన్ ఇచ్చినందుకు అతని పేరుఇసుక మాపియా కు చెప్పడంతో ఆ వ్యక్తిని ఇసుక మాఫియా చితకబాదిన సంఘటనలు ఉన్నాయి. ఇలా అధికారుల అండదండలు ఇసుక మాఫియాకు ఉండటంతో ఇసుకసురులకు రోజురోజుకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. పోలీస్ స్టేషన్లో ఉన్న ఎస్ఐ, ఏదైనా పనిమీద గాని సెలవుల పైన ఒక్కరోజు ఊరు వెళ్లిన ఆరోజు రాత్రి కి రాత్రి నిమ్మపల్లి, వట్టిమల్ల, వెంకట్రావుపేట, బావుసాయిపేట,నిజామాబాద్,మామిడిపల్లి,కనగర్తి, సుద్దాల, గ్రామాలలో ఇసుక మాఫియా కు క్రింది స్థాయి అధికారులు సహకరిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇలాగే జరిగితే ఇల్లు నిర్మాణాలు చేసుకునే సామాన్యుని జేబు గుల్ల కావడం ఖాయమని, అలాగే భారీగా ప్రభుత్వదాయానికి గండి పడుతుందని ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇసుక మాఫియా కు సహకరిస్తున్న అధికారులపై సీతకన్ను పెట్టి పూర్తిస్థాయి విచారణ చేసి అక్రమ ఇసుక రవాణా కు అడ్డుకట్ట వేయాలని ప్రకృతి సంపద అయిన మూలవాగును కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు...**

**తహసిల్దారు విజయ్ ప్రకాష్ రావు..**

ఇదే విషయమై కోనరావుపేట తాహసిల్దార్ విజయ్ ప్రకాష్ రావు, ను వివరణ కోరగా ప్రకృతి సంపదల అయినటువంటి ఇసుకను, మట్టిని అక్రమ రవాణా చేస్తు పట్టుబడితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని మొదటిసారి అక్రమ రవాణా చేసిన ట్రాక్టర్లకు 5000 రెండవసారి పట్టుబడితే 15000 మూడోసారి సిజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా నూతనంగా ఇంటి నిర్మాణం చేసుకునే వారు ఇంటి దరఖాస్తు ఫారం తో పాటు పంచాయతీ సెక్రటరీ సంతకంతో కూడిన ధ్రువీకరణ పత్రం డిడి, ట్రాక్టర్ పేపర్స్ తో దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికి ఇసుక పర్మిషన్ ఇవ్వడం జరుగుతుందని అలాగే ప్రభుత్వ పని దినాలలో మేము సూచించిన రోజుల లో మాత్రమే వర్కింగ్ అవర్స్ లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇసుక రవాణా చేసుకోవడానికి అనుమతులు ఉన్నాయని ఆ తర్వాత సమయాలలో ఇసుకను రవాణా చేస్తే వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం
# మల్లాపూర్ ని సందర్శించిన బ్యాంక్ సీఈవో



మల్లాపూర్ మార్చ్ 2 ( ప్రజా జ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మల్లాపూర్ నందు ఎం ఎస్ సి పథకం నాబార్డ్ వారి రుణం ద్వారా 200 ఎం టి ఎస్ ఎరువుల గోదాం ,స్టోరేజ్ కం ఆఫీస్ బిల్డింగ్ నీ కేడీసీసీ బ్యాంక్ సీఈఓ యన్.సత్య నారాయణ రావు పనుల పురోగతిని పరిశీలించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ నందు కొత్తగా సహకార క్రాంతి డిపాజిట్ పథకం ప్రవేశపెట్టినారన్నారు. ఇతర బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ వస్తుందని కావున కేడీసీసీ బ్యాంకు నందు డిపాజిట్ చేయాలన్నారు. అలాగే బ్యాంక్ , పాక్స్ నందు రుణాలు తీసుకున్న సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంక్ లోని మిగతా సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.ఈకార్యక్రమంలో పిఎసిఎస్ మల్లాపూర్ అధ్యక్షులు నర్సారెడ్డి. బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, దిఈ శ్రీనివాస్ , బ్యాంక్ ఇంజనీర్ రమేష్ , సంఘ కార్యదర్శి భూమేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగామాజీ స్పీకర్ శ్రీపాదరావు జన్మదిన వేడుకలు



కాల్వ శ్రీరాంపూర్ ,(ప్రజా జ్యోతి) మార్చి 2 : కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో మాజీ స్పీకర్ శ్రీపాదరావు జన్మదిన వేడుకలను ప్రభుత్వ కార్యాలయాలుతహసిల్దార్ కార్యాలయం మండల పరిషత్ కార్యాలయంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జనసదయ్య ఆధ్వర్యంలోశనివారం రోజున ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలోఎంపీపీ సంపత్ కుమార్జెడ్ పి టి సి తిరుపతిరెడ్డిఎంపీడీవోకలికోట రామ్మోహనచారితహసిల్దార్ జహీద్ పాషా ఎం పి ఓ గోవర్ధన్ ఏ పి ఓ మంజుల ఏపిఎం కనుకయ్య మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి మునీరు జిల్లా కార్యదర్శి పులి ఇంద్రకరణ్ రెడ్డి లతోపాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా శ్రీపాదరావు జయంతి

శంకరపట్నం మార్చి 2 (ప్రజాజ్యోతి) మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో నల్లశ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీస్పీకర్ శ్రీపాదరావు 87వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నల్ల శ్రీవాణి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ఆయన ఘనతని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ ఖాజా బషీరుద్దీన్, సూపరిటెండెంట్ ఎం. శ్రీధర్ గౌడ్, రికార్డు అసిస్టెంట్లు, ఈ ఆపరేటర్లు గుర్రం అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధిపై సమీక్ష సమావేశం**

మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం అడిషనల్ డి ఆర్ డి ఓ సంధ్యారాణి పంచాయతీ సెక్రటరీలు,ఫీల్డ్ అసిస్టెంట్లతో మండల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీఓ, ఏపీవో, టీఏస్ లో పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి బియ్యం వితరణ

**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దీటి నరసింహులు**

ముస్తాబాద్ మార్చి2( ప్రజాజ్యోతి) : ముస్తాబాద్ మండలానికి చెందిన గొట్టే ఎల్లం అనే వ్యక్తి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందాడు.మృతునికి భార్య ఆండాలు కొడుకు, కూతురు ఉన్నారు.వారి ఆర్థిక పరిస్థితి దయనీయ స్థితిలో ఉందన్న విషయం తెలుసుకున్న ముస్తాబాద్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులైన దీటి నరసింహులు ఆ కుటుంబానికి తనవంతు సహాయంగా 50 కిలోల బియ్యం అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో,మచ్చ కొండయ్య,సుంచు శంకరయ్య,సుంచు కిషన్,ముక్క నరసయ్య, నాంపల్లి వెంకటయ్య,గొట్టె బాలనర్సు పాల్గొన్నారు.